క్లుప్తంగా

నేడు పెద్దపాల్లలో 'గడపగడపకు మన ప్రభుత్వం'

సీతంపేట: మండలంలోని పెద్దపొల్ల గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.సత్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, సచివాయల సిబ్బంది, వలంటీర్లు హాజరుకావాలని కోరారు.

బయో ఇన్‌పుట్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి



బయోఇన్‌పుట్ సెంటర్‌ను ప్రారంభించిన ఏఓ శ్రావణ్

బలిజిపేట: చిన్న, సన్నకారు రైతులు బయో ఇన్పుట్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ శ్రావణ్ కోరారు. ఈ మేరకు మండలంలోని మిర్తివలసలో డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు మామిడితోటలో ఏపీసీఎన్ఎఫ్ ఏర్పాటుచేసిన బయో ఇన్‌పుట్ సెంటర్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీనివల్ల చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయ పెట్టుబడులు తగ్గే అవకాశాలున్నాయన్నారు. అధిక దిగుబడులను పొందవచ్చని చెప్పారు. ఈ సెంటర్‌లో లభించిన దశపర్ణిక, అగ్ని అస్త్రం, బ్రహ్మాస్త్రం, మీనామృతం, ఎగ్ ఏమినో యాసిడ్, పంచగవ్య, పుల్లటి మజ్జిగ, జీవామృతాలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది మానస, శారద, లక్ష్మి, దేవిప్రసాద్, తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

బలిజిపేట: సమగ్ర శిక్ష ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ బలిజిపేట ఎంఆర్సీ వద్ద సోమవారం నిరసన చేపట్టారు. తక్షణమే ఎంటీఎస్ అమలు చేసి వేతనాలు పెంచాలని, జూలై నెల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

షెడ్ ధ్వంసంపై ఫిర్యాదు




కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న యోగా డైరెక్టర్లు

బొబ్బిలి: పట్టణంలోని శ్రీయోగా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ షెడ్‌ను పాడు చేసి బడ్డీ పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని యోగా కేంద్రం డైరెక్టర్లు ఈశ్వర వరప్రసాద్, సత్య, స్థానికులు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌ను సోమవారం కలిసి ఫిర్యాదు చేశారు. అలాగే సీఐ, ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసినట్లు డైరెక్టర్లు తెలిపారు.

లక్ష్య సాధనకు కృషిచేయాలి

రాజాం సిటీ: కళాశాల స్థాయిలోనే విద్యార్థులు జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు కృషిచేయాలని రాజాం టౌన్ సీఐ కె.రవికుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ, సత్ప్రవర్తన అలవర్చుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్సై పి.నీలావతి, ప్రిన్సిపాల్ పి.స్వప్నహైందవి, జీజే కళాశాల ప్రిన్సిపాల్ ఉరిటి జగదీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఎంఈఓకు సన్మానం



ఎంఈఓ-1 శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎంఈఓ-2 భాస్కరరావు, ఎమ్మార్సీ సిబ్బంది

భామిని: ఈ ఏడాది స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఎంఈఓ శ్రీనివాసరావును స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఎంఈఓ-2 ఊయక భాస్కరరావు ఆధ్వర్యంలో ఎమ్మార్సీ సిబ్బంది, హెచ్ఎంలు శ్రీనివాసరావును సత్కరించారు. ఉత్తమ ఎంఈఓగా అవార్డు తీసుకోవడం ద్వారా భామిని మండలానికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చారన్నారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, హెచ్ఎంలు పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించాలి

గరుగుబిల్లి: విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలను బోధించాలని చిలకాం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కె.రామ్మోహనరావు అన్నారు. పాఠశాలలో సోమవారం పార్వతీపురానికి చెందిన ఆధ్యాత్మిక గురువు త్రినాథస్వామిని సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలతో పాటు క్రమశిక్షణ, ఆధ్యాత్మిక భావాలను పెంపొందించేందుకు కృషిచేయాలన్నారు.

విభిన్న ప్రతిభావంతుల భవితకు భరోసా



విభిన్న ప్రతిభావంతులకు వీల్‌చైర్లు పంపిణీ చేస్తున్న దృశ్యం(ఫైల్)

- భవిత కేంద్రాల్లో విద్యతో పాటు ఫిజియోథెరపీ సేవలు
- శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పాటు
- 15 కేంద్రాల్లో శిక్షణ

సీతంపేట: అన్ని విధాలా ఆరోగ్యంగా ఉన్న చిన్నారులు ఆటపాటలతో కూడిన విద్యను హాయిగా పొందుతారు. వారికి కలిగే ఇబ్బందులలు, అనుభూతులను వారి తల్లిదండ్రులతో పంచుకుంటారు. కానీ దివ్యాంగులైన చిన్నారులు వారికి సంతోషమైనా, కష్టమైనా వారి భావాలను పూర్తిస్థాయిలో వ్యక్తం చేయలేరు. విభిన్న ప్రతిభావంతులైన ఈ చిన్నారులు మిగిలిన వారితో సమానంగా అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ప్రభుత్వం సహిత విద్యను ప్రవేశపెట్టింది. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు ఇంటికే పరిమితం కాకుండా మానసికంగా, శారీరకంగా ఎదిగేందుకు సహకరించే లక్ష్యంతో భవిత కేంద్రాలను ఏర్పాటు చేసింది. వారికున్న లోపాలను అధిగమించడానికి ఈ కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణతో పాటు ఫిజియోథెరపీ అందిస్తున్నారు. ఆటపాటలతో వారు ఆనందంగా గడిపేలా చేస్తూ వారిలో సెల్ఫ్ కాన్ఫిడెన్స్‌ను నింపుతున్నారు.



భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతులైన చిన్నారులకు అందిస్తున్న ఫిజియోథెరఫీ సేవలు

ఇదీ పరిస్థితి..

శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విభిన్న ప్రతిభావంతులైన చిన్నారుల కోసం ప్రభుత్వం భవిత కేంద్రాల్లో విద్యతో పాటు ఫిజియోథెరఫి సేవలను అందిస్తోంది. కదల్లేని దుస్థితిలో ఇంటి వద్ద ఉన్న చిన్నారులకు వారానికోసారి వారి ఇంటికి వెళ్లి ఫిజియోథెరపీ సేవలు అందిస్తూ వారిలో శారీరక, మానసిక పరివర్తన తీసుకొచ్చేందుకు ఐఆర్‌టీలు కృషిచేస్తున్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను భవిత కేంద్రాలకు తీసుకుని వచ్చేందుకు తల్లిదండ్రులు/సంరక్షకులకు ప్రభుత్వం అలవెన్సులు అందిస్తోంది. రవాణా, హోమ్‌బేస్డ్ ఎడ్యుకేషన్, ఎస్కార్ట్, బాలికా విద్య స్టైఫండ్ పేరుతో ప్రోత్సాహకాలు అందిస్తున్నారు.

అలవెన్సుల చెల్లింపు ఇలా..

అలవెన్సు	విభిన్న ప్రతిభావంతులు	ఒక్కొక్కిరికి చెల్లించేది(నెలకు)	మొత్తం
ట్రాన్స్‌పోర్టు	180	3,000	5,40,000
స్టైఫండ్	356	2,000	7,12,000
హోంబేస్డ్	110	3,000	3,30,000
సహాయకులు	153	3,000	4,59,000
మొత్తం	799	11,0000	20,41,000

జిల్లాలో ఈ ఏడాది గుర్తించిన విభిన్న ప్రతిభావంతులు	109
యూ డైస్ ప్రకారం పాఠశాలల్లో/ భవిత కేంద్రాల్లో ఉన్న వారు	1200
మొత్తం భవిత కేంద్రాలు	15
మంజూరైన ఫిజియోథెరపిస్ట్ పోస్టులు	5
అందుబాటులో ఉన్నవారు	2
మంజూరైన ఐఈఆర్‌టీలు	30
అందుబాటులో ఉన్నవారు	20 మంది
హెల్పర్లు(ఆయాలు)గా చేస్తున్నవారు	15 మంది

అన్ని రకాల సౌకర్యాలు కల్పన



విభిన్న ప్రతిభావంతులకు అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుంది. ఈ విద్యార్థుల్లో ఉన్న లోపాలను సరిదిద్ది సాధారణ పిల్లలతో సమానంగా తయారు చేయడం జరుగుతుంది. వీరికి అన్ని సదుపాయాలు, ప్రభుత్వం ఇస్తున్న పథకాలు వర్తించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. – నిమ్మక ప్రేమ్‌కుమార్, డీఈఓ

దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక సంరక్షణ



దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక సంరక్షణ చర్యలు చేపడుతున్నాం. అన్ని రకాల నైపుణ్యాలు అందజేయడం జరుగుతుంది. వివిధ బోధనా పద్ధతులు అవలంభిస్తున్నాం. ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించిన ప్రశస్త యాప్ ద్వారా ఇటువంటి పిల్లల గుర్తింపు ప్రక్రియ జరుగుతుంది. – భానుమూర్తి, జిల్లా కోఆర్డినేటర్, సహిత విద్య

ఆధార్‌కార్డుల పునరుద్ధరణకు చర్యలు

- ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: గిరిజన ప్రాంతాల్లో సస్పెండైన ఆధార్‌కార్డుల పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చాలా ఆధార్‌కార్డులు సస్పెండ్ అయినట్టు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తన దృష్టికి వచ్చిందన్నారు. సీతంపేట మండలం ఉమ్మగెడ్డ గ్రామంలోనే 20 మంది ఆధార్‌కార్డులు వినియోగంలో లేవని గిరిజనులు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సీఎంఓ కార్యాలయం అధికారులకు రెండు రోజుల క్రితం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించిందని, సస్పెండైన ఆధార్‌కార్డులపై విచారణ చేసి వినియోగంలోకి వచ్చేలా చూడాలని డుమా పీడీకి సీఎంఓ నుంచి సోమవారం ఉత్తర్వులు వచ్చాయని వెల్లడించారు. ఎవరెవరి ఆధార్‌కార్డులు ఆగిపోయాయో వారంతా తగిన ఆధారాలతో సంబంధిత అధికారులను సంప్రదించినట్లయితే వారు సమస్యను పరిష్కరిస్తారన్నారు. గ్రామాల్లో కార్యదర్శులు సర్వే చేసి ఆధార్‌కార్డు సస్పెండ్ అయిన వారి వివరాలు సేకరించాలని సూచించారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం..



ఎమ్మెల్సీ విక్రాంత్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న సెర్ప్ సిబ్బంది

పాలకొండ: తమ జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని పేదరిక నిర్మూల సంస్థ (సెర్ప్) సిబ్బంది అన్నారు. పేదరిక నిర్మూలన సంస్థలో పని చేస్తున్న సిబ్బందికి ఫిట్‌మెంట్‌ను 23 శాతం పెంచుతూ ప్రభుత్వం జీఓ నంబర్ 64 విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ను సోమవారం కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

మణిపూర్ హింసాకాండకు కేంద్రానిదే బాధ్యత




ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం, క్రైస్తవ సంఘాలు

పార్వతీపురంటౌన్: మణిపూర్‌లో హింసాకాండకు కేంద్రమే బాధ్యత వహించాలని క్రైస్తవ, ముస్లిం సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్వతీపురం పట్టణంలో మార్కెట్ యార్డు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్‌లో జరిగిన ఘటనను నిర్వహిస్తూ శాంతియుతంగా ర్యాలీ నిర్వహించామన్నారు. దేశంలో ఎన్నడూ లేనివిధంగా మత కలహాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

మణిపూర్ ఘటనపై ప్రభుత్వం స్పందించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిషప్ సుదర్శనరావు, స్టీఫెన్‌పాల్, పి.జాకబ్, కె.విజయరాజు, జి .తంబిపాల్, ఎస్‌కేపాల్, ఎ.శామ్యూల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన తయారీపై అవగాహన



విత్తనోత్పత్తిపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

పాలకొండ రూరల్: రైతులు విత్తన తయారీపై ఆసక్తి పెంచుకోవాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కె.రత్నకుమారి అన్నారు. మండలంలోని అవలంగి గ్రామంలో విత్తనోత్పత్తి పథకంపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. విత్తనోత్పత్తి చేసే రైతులకు ప్రభుత్వం అందించే రాయితీలు, ప్రోత్సాహకాలను వివరించారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయశాఖ సిబ్బంది సూచనలు, సలహాలు పాటిస్తూ సాగులో లాభాలు పొందాలని సూచించారు.

త్రైతసిద్ధాంత ప్రచారం

పాలకొండ రూరల్: స్థానిక బాలాజీనగర్, సీతంపేట రోడ్డులో త్రైత సిద్ధాంతంపై సోమవారం ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రభోదానంద యోగేశ్వరులు రచించిన గ్రంథాల్లోని సారాన్ని వివరించారు. ప్రతి ఒక్కరూ భగవద్గీతను పఠనం చేయాలని, తోటివారి పట్ల స్నేహపూర్వకంగా నడుచుకోవాలని, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని సూచించారు. వివిధ గ్రంథాలను ప్రదర్శించారు.

నేటి నుంచి ఆధార్ సేవా శిబిరాలు

గరుగుబిల్లి: గ్రామ సచివాలయాల్లోని ఆధార్ సెంటర్ల వద్ద మంగళవారం నుంచి ఈనెల 25 వరకు ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.పైడితల్లి సోమవారం తెలిపారు. గరుగుబిల్లి, రావివలస, ఉల్లిభద్ర గ్రామాల్లోని సచివాలయాల్లో ఆధార్ శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. ఆధార్ కార్డు అప్‌డేషన్, తప్పుల సవరణ, ఫోన్ నంబర్ లింక్ తదితర సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మిగులు సీట్ల భర్తీకి 30న కౌన్సెలింగ్

గుమ్మలక్ష్మీపురం: భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి ఈనెల 30న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 27లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 28న కళాశాలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు విద్యార్హతకు సంబంధించి ఒరిజినల్ ధ్రువపత్రాలను వెంట తీసుకురావాలని కోరారు.

ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలి

భామిని: కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ స్థానిక ఎమ్మార్సీ ఎదుట సోమవారం ఆయా ఉద్యోగులు నిరసన ప్రదర్శన చేపట్టారు. పాదయాత్రలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు తమను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఎమ్మార్సీ సిబ్బంది, సీఆర్‌పీలు, ఐఈఆర్‌టీలు నిరసనలో పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలపై దృష్టి సారించాలి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ కుమార వర్మ

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పంచాయతీ కార్యదర్శులు పరిష్కరించాలని ఈఓపీఆర్డీ కె.కుమార వర్మ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం గెడ్డలుప్పి గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య, పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో సర్పంచ్‌ల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య పనులు చేపట్టి కాలువల్లో పూడికలు తీయించడం, స్వచ్ఛమైన తాగునీరు సరఫరా, దోమలు నివారణ మందు పిచికారీ చేయించడం, విద్యుద్దీకరణ పనులు చేయిస్తున్నట్లు చెప్పారు. వర్షాలు కురవడం వల్ల విధిగా క్లోరినేషన్ చేయించాలని సూచించారు. జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులకు నచ్చచెప్పి పూర్తి చేయించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ. తిరుపతిరావు, కార్యదర్శి మోహనరావు, ఎంపీటీసీ సత్యనారాయణ పాల్గొన్నారు.

గిరిజన స్పందనకు 66 వినతులు



వినతులు స్వీకరిస్తున్న ఏపీఓ రోసిరెడ్డి

సీతంపేట: ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ఏపీఓ రోసిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిజన స్పందనకు 66 వినతులు వచ్చాయి. పవర్‌వీడర్ మంజూరు చేయాలని దోనుబాయికి చెందిన దుర్గారావు, పిండిమిల్లు ఏర్పాటుకు రుణం ఇప్పించాలని దుగ్గికి చెందిన సూరమ్మ వినతులు అందజేశారు. భామిని ఆశ్రమ పాఠశాలలో ఎస్ఎస్ఎం, వాచ్‌మెన్ పోస్టు ఇప్పించాలని లోహరిజోలకు చెందిన పద్మ అధికారులను కోరారు. అలాగే టెంట్‌హౌస్ మంజూరు చేయాలని రాయిలంకకు చెందిన ఆరిక ఆనంద్, తాగునీటి సదుపాయం కల్పించాలని పెద్దోడిగూడకు చెందిన సవర ఆనప, సోలార్ పంప్‌సెట్ మంజూరు చేయాలని సవర సీతాపురం సిమ్మయ్య, కొండచీపుర్లు లోన్ ఇప్పించాలని బొక్కిడిగూడకు చెందిన జగదీష్ స్పందనలో వినతులు అందజేశారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి



కార్యదర్శులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ సాల్మన్‌రాజు

గుమ్మలక్ష్మీపురం: గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలని ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు అన్నారు. సోమవారం తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రస్తుత సీజన్‌లో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రక్షిత మంచినీటి పథకాలను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయించాలని, మురుగునీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించాలని సూచించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ జి.జగదీష్ కుమార్ ఉన్నారు.

ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తిచేసుకోండి



నూతన గృహ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జమ్మాన ప్రసన్న కుమార్

బలిజిపేట: నవరత్నాలు పథకంలో భాగంగా పేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం మంజూరుచేసిన గృహాలను లబ్ధిదారులు త్వరగా పూర్తిచేసుకోవాలని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బలిజిపేట మండలం మిర్తివలసలో నూతన గృహ నిర్మాణాలకు సోమవారం ఆయన భూమిపూజ చేశారు. లబ్ధిదారుల ఆహ్వానం మేర విచ్చేసిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా లబ్ధిపొందిన వారు త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తిచేసుకుని సొంత ఇంటి యజమానులు కావాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జీవన

గుమ్మలక్ష్మీపురం: ఇళ్ల స్థలాల సాధన కమిటీ ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం నుంచి మూడు రోజుల పాటు రిలే నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న తెలిపారు. ఈ మేరకు పలువురు గిరిజనులతో కలిసి ఎల్విన్‌పేటలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భద్రగిరి గురుకుల విద్యాసంస్థ సమీపంలో ఉన్న ఖాళీ భూముల్లో నిరుపేద గిరిజనులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్, పీఓ, జేసీ, డీఎఫ్ఓలను కలిసి వినతిపత్రాలు అందజేసినట్లు చెప్పారు. అధికారులు సమగ్రంగా పరిశీలన చేసి గిరిజనులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించినప్పటికీ సర్వేల పేరుతో జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లులేని నిరుపేద గిరిజనులు దీక్షలో పాల్గొనాలని ఆయన కోరారు.

ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: నియోజకవర్గంలోని మెంటాడ మండలంలో కేంద్రియ గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపనకు ఈ నెల 25న రానున్న ప్రియతమ నాయకుడు, ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయన పట్టణంలోని తన గృహంలో సాలూరు మున్సిపాలిటీ, సాలూరు, పాచిపెంట, మెంటాడ, మక్కువ మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ముఖ్యమంత్రి పర్యటనపై చర్చించారు. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా నియోజకవర్గానికి వస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వస్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం 7.30 గంటలకు నిర్దేశించిన ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సుల్లో బయల్దేరాలని సూచించారు. జననేత కార్యక్రమానికి వస్తున్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నాయకులు బాధ్యత తీసుకోవాలని చెప్పారు. ప్రజలకు మండలాల వారీగా కేటాయించిన ప్రాంతాల్లో భోజనసదుపాయాలు ఉంటాయని వివరించారు. ముఖ్యమంత్రి పర్యటనకు పరిసర నియోజకవర్గాల నుంచి సుమారు లక్ష మంది వచ్చే అవకాశం ఉంటుందని అంచనా వేశారు. నియోజకవర్గం నుంచి సుమారు 140 బస్సులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

ఊరటనిచ్చిన వర్షం



భామినిలో కురుస్తున్న వర్షం

భామిని: గత కొద్ది రోజులుగా ఎండ తీవ్రత పెరగడంతో పాటు ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు సోమవారం కురిసిన వర్షం కాస్త ఉపశమనమిచ్చింది. రోజంతా ఎండతీవ్రతకు అల్లాడిన జనాలకు చల్లదనం అందించింది. కాగా, గత కొద్ది రోజులుగా ఎండలతో పాటు విద్యుత్ కోతలతో ప్రజలు ఉక్కపోతకు గురవుతున్నారు.